ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌ను కోరిన చింతలపూడి ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

చింతలపూడి: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ కలెక్టర్ కె.వెట్రిసెల్విని కోరారు. ఆయన బుధవారం ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి నియోజకవర్గ పరిధిలోని సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. చింతలపూడి, లింగపాలెం మండలాలను ఏలూరు రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయాలని ఎంఎల్‌ఎ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదాత 'వర్రీ'..!

- అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో పెనుమార్పు
- డెల్టాలో అత్యధిక భాగం పొట్ట, ఈనిక దశలో పంట
- మెట్ట ప్రాంతంలో కోత దశకు చేరిన వరి పంట
- భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టమంటున్న అన్నదాత
- రెండు జిల్లాల్లో దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరిసాగు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. మబ్బులు, వర్షాలతో ఖరీఫ్ సాగుపై తీవ్ర ఆందోళన నెలకొంది. ఖరీఫ్‌లో పశ్చిమలో 2.05 లక్షలు, ఏలూరు జిల్లాలో లక్షా 95 వేల ఎకరాలు రెండు జిల్లాల్లో మొత్తంగా నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఎన్నో వ్యయప్రయాసల అనంతరం పంట చివరి దశకు చేరింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఒక్కసారిగా వాతావరం మారిపోయింది. అల్పపీడనం వాయుగుండంగా మారనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. దీంతో ఖరీఫ్ సాగు పరిస్థితి ఏమిటనే బెంగ అన్నదాతను వెంటాడుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, భీమడోలు వంటి మండలాలతోపాటు పశ్చిమలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు వంటి పలు మండలాల్లో వరి కోత దశకు చేరింది. డెల్టాలోని పలు ప్రాంతాల్లో పంటంతా పొట్ట, ఈనిక దశలో ఉంది. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడనుంది. ఈనిక దశలో వర్షాలు కురిస్తే కంకులకు ఉన్న సొంపు రాలిపోయి తాలు గింజలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. అదే జరిగితే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుంది. కోత దశకు చేరిన పంట నేలకొరిగితే రైతులు మాసూలు చేసేందుకు నానా యాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ఎరువులు, పురుగు మందులకు పెద్దఎత్తున ఖర్చు పెట్టారు. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే రైతులకు మరింత ఖర్చులు పెరిగిపోగా, పంట చేతికి రావడం కష్టంగా మారుతోంది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి రానుంది. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో ఆధునికీకరణ లేక పంట కాలువలన్నీ మెరకదేరిపోయాయి. భారీ వర్షాలు కురిస్తే వరద నీటికి పంట పొలాలు నీట మునిగే ప్రమాదం ఉంది. దీంతో పంట నష్టం తీవ్రత పెరగనుంది. పంట చివరిదశలో వాయుగుండం వంటి హెచ్చరికలతో రైతులు లోలోన గుబులు చెందుతున్నారు. మూడెకరాలు సాగు చేసే రైతు సైతం ఇప్పటికే రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టారు. ఏదైనా సమస్య వస్తే సర్వం కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది.

కౌలురైతుల్లో గుబులు

రెండు జిల్లాల్లో సాగైన నాలుగు లక్షల ఎకరాల్లో 80 శాతం కౌలు రైతులే చేస్తున్నారు. కౌలు కార్డుల జారీ, పంట రుణాల అందజేత అనేది ప్రహసనంగా మారిపోయింది. దీంతో కౌలురైతులకు పంటరుణాలు అందని ద్రాక్షగా మారాయి. దీంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేసిన పరిస్థితి ఉంది. పంట చివరి దశకు చేరిన సమయంలో వాతావరణంలో మార్పులు కౌలురైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కౌలు, పెట్టుబడులు పెరగడంతో వరిసాగులో మిగులు అనేది లేకుండాపోయింది. అయినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో కౌలురైతులు అప్పులు చేసి మరీ సాగు చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతిన్న కౌలురైతులకు నష్టపరిహారం అందడం లేదు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా భూయజమానులకే పరిహారం ఇస్తున్న పరిస్థితి ఉది. బీమా పరిహారం సైతం కౌలురైతులకు ఇవ్వడం లేదు. దీంతో ఏదైనా విపత్తు వస్తే కౌలురైతులు రోడ్డున పడుతున్నారు. ఖరీఫ్ చివరిదశలో నెలకొన్న వాతావరణ మార్పులు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో అల్పపీడన ప్రభావం అధికారుల్లోనూ గుబులు రేపుతోంది. పంటంతా తడిస్తే కొనుగోలుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉండటంతో అధికారుల్లోనూ చర్చ నడుస్తోంది.

ధాన్యం కొనుగోలులో మొదటిస్థానంలో నిలపాలి

233 ఆర్‌ఎస్‌కెల్లో అందుబాటులో గోనె సంచులు: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ధాన్యం కొనుగోలులో జిల్లాను మొదటిస్థానంలో నిలిపేలా సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జిల్లాలో 233 రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో గోనె సంచులు, టార్పలిన్లు సిద్ధంగా ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలుకు 700 మంది సిబ్బంది, మొదటి విడతగా 80 లక్షల గోనె సంచులు, జిపిఎస్ డివైజ్ సిస్టమ్‌తో మూడు వేల వాహనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. స్థానిక డిసిఎంఎస్ ఫంక్షన్ హాల్లో బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సంబంధిత సిబ్బందికి అవగాహనా సదస్సు, సాంకేతిక శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను, టెక్నికల్ అంశాలను టెక్నికల్ బృందం సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం లక్ష మెట్రిక్ టన్నులు టార్గెట్ అదనమన్నారు. అదనంగా సిబ్బందిని, మౌలిక సదుపాయాలు, పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రం నుంచి జారీ చేసిన కూపన్లు ఆధారంగా మాత్రమే ధాన్యం సేకరణ జరుగుతుందని, ధాన్యం విక్రయించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ మిల్లర్లను సంప్రదించాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో సొమ్ము రైతుల ఖాతాల్లో జమవుతుందన్నారు. ఆర్‌ఎస్‌కెల వద్ద విధులు నిర్వర్తించే వ్యవసాయ సహాయకులు, సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు నిష్పక్షపాతంగా, వివాదాలకు తావులేకుండా విధులు నిర్వహించాలన్నారు. ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆ రీత్యా రైతులను మరింత అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలపై మండలస్థాయి అధికారులను సంప్రదించి తక్షణ పరిష్కారం చూపాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకీదేవి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ పి.శివరామ్మూర్తి, వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ భాషా, డిఎస్‌ఒ ఇబి.విలియమ్స్, డిసిఒ ఆరిమిల్లి శ్రీనివాస్, డిటిసి ఎస్‌బి.శేఖర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీడని వర్షం.. స్తంభించిన జనజీవనం

ముంపులో పలు కాలనీలు

చేవూరు కాలనీ లో రోడ్లపై చేరిన నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. విడవకుండా కురుస్తున్న వర్షంతో అన్ని గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. వర్షంతో డ్రెయినేజీలు పొంగి రోడ్లపైకి నీరు భారీగా చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆరు గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో గృహోపకరణాలు తడిసిపోయాయి. నివాసాల చుట్టూ నీరు భారీగా చేరడంతో నివాసితులు ఇంటి నుండి బయటకు వెళ్లేందుకు నానాయాతనలు పడ్డారు. చేవూరు వైఎస్‌ఆర్ కాలనీ, అన్నవరం జగనన్న కాలనీ, పెయ్యేరు కాలనీ తదితర కాలనీల్లో ఇళ్ల చుట్టూ నీరు చేరింది. దీంతో ఇంట్లో నుంచి కాలు బయటికి పెట్టాలంటే జనం జంకుతున్నారు. వర్షానికి కొనుగోలుదారులు లేక దుకాణాలన్నీ వెలవెల బోయాయి.

కలిదిండి: ఉరుములు మెరుపులతో బుధవారం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కలిదిండి నుండి గుర్వాయిపాలెం వరకు పలుచోట్ల రాష్ట్రీయ రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. బస్టాండ్ వద్ద మోకాళ్ల లోతు నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈద్గా సమీపంలోని ఊర చెరువు నిండి రోడ్లపైకి, సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరింది. పడమటిపాలెం బంక్ కాలనీని వర్షపు నీరు చుట్టుముట్టింది. సుమారు 20 కుటుంబాలు ఇళ్ల నుండి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. స్థానిక శాఖ గ్రంథాలయం చుట్టూ నీరు నిలిచింది. ఉప్పుటేరు పోటెత్తడంతో ప్రధాన మురుగు కాలువల్లో నీరు ప్రవహించే పరిస్థితి లేక ఎక్కడి నీరక్కడే నిలిచింది. దీంతో డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపైకి చేరింది. మారిన వాతావరణ పరిస్థితులతో రొయ్య రైతులు చెరువుల వద్దే పడిగాపులు పడుతున్నారు.

ఏలూరు సిటీ: నగరంలో బుధవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నానికి నగరం నల్లని మబ్బులతో కారు చీకట్లు కమ్ముకుని కొంతసేపటికి వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. రోడ్లపై నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు కొంత ఇబ్బందికి లోనయ్యారు. వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితం కావడంతో చిరు వ్యాపారులు వ్యాపారాలు లేక లబోదిబోమంటున్నారు.



ఏలూరులో కురుస్తున్న వర్షం

జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా అజీజ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా ఎస్‌ఎ.అజీజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్‌టిఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఏలూరు జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉన్న క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు శాప్ హెడ్డాఫీస్‌కు బదిలీపై వెళ్లారు. ఏలూరు నివాసి అయిన అజీజ్ చిన్నప్పటి నుంచి స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో హాకీ క్రీడాకారుడిగా తర్ఫీదు పొంది, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించి, ఎన్‌ఐఎస్ శిక్షణ పొందారు. 1999లో తొలిసారిగా ఏలూరులోనే తాను ప్రాక్టీస్ చేసిన అల్లూరి సీతారామరాజు స్టేడియంలోనే హాకీ కోచ్‌గా నియమితులయ్యారు. 16 సంవత్సరాలు హాకీ కోచ్‌గా పనిచేసి అనంతరం 2016 నుంచి 19 వరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా, 2019 నుంచి 2022 వరకు చీఫ్ కోచ్‌గా పనిచేసి 2022లో బదిలీపై ఎన్‌టిఆర్ జిల్లాకు వెళ్లారు. తిరిగి ఏలూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా బదిలీపై వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

అటవీ చట్టాల అమలులో పాలకుల నిర్లక్ష్యం

ఐటిడిఎ వద్ద నిరసనలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ



ఐటిడిఎ పిఒకు వినతులు అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనేతరులు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి గిరిజన చట్టాలను అధికారులు తుంగలోకి తొక్కుతున్నారని, పట్టించుకోవాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. పోడు భూములకు పట్టాలు, వలస గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుట్టాయగూడెం మండలం కెఆర్‌పురంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. అటవీ హక్కుల చట్టం వచ్చి నేటికి 19 సంవత్సరాలైనా గిరిజనులకు పట్టాలివ్వడంలో పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరి ప్రదర్శిస్తున్నాయని మండిపడ్డారు. విలీన మండలాల్లో వలస గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉభయ రాష్ట్రాలకు అనుబంధంగా ఉన్న పెదవాగు ప్రాజెక్టు మరమ్మతుల పనులను రెండు ప్రభుత్వాలు సమన్వయంతో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ఐటిడిఎ పిఒ రాములుకు పోడు భూములు, కుల ధ్రువీకరణ దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు చలసాని వెంకట రామారావు, నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాల వల్లే పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలు

ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్లే రాష్ట్రంలో రైతాంగ ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య తీవ్రంగా విమర్శించారు. బుధవారం స్థానిక అన్నే భవనంలో సంఘం జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథి కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు పండించిన ఏ పంటకూ కనీస మద్దతు ధర కూడా రావడం లేదన్నారు. ఉల్లి, శెనగలు, మిర్చి, పొగాకు, టమోటా వంటి పంటలకు కనీస ధరలు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి పథకానికి ఒక పైసా కూడా కేటాయించడం లేదన్నారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతుంటే కేవలం 50 లక్షలు మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. మిగిలిన 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎవరికి అమ్ముకోవాలని ప్రశ్నించారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా సబ్సిడీ తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇవ్వాల్సిన కోటా యూరియాను సరఫరా చేయకుండా కృత్రిమ కొరత సృష్టించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తన కోటాలో 25 శాతం యూరియా దిగుమతిని తగ్గించుకోవడం వల్ల కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1700 కోట్లు ఇచ్చిందన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రైతు ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం X డిప్యూటీ స్పీకర్..!

కాకరేపుతున్న భీమవరం డిఎస్‌పి వివాదం

డిఎస్‌పి సెటిల్‌మెంట్లపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలన్న పవన్‌కల్యాణ్

సదరు పోలీస్ అధికారి ట్రాక్ రికార్డ్ అద్భుతమంటూ రఘురామకృష్ణరాజు కితాబు

జనాలు, పోలీసుల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

భీమవరం డిఎస్‌పి జైసూర్యకు సంబంధించిన వివాదం రాజకీయాల్లో కాకరేపుతోంది. డిప్యూటీ సిఎం, వర్సెస్ డిప్యూటీ స్పీకర్ అన్నట్లుగా పరిస్థితి మారిందన్న చర్చ సాగుతోంది. భీమవరం డిఎస్‌పి జైసూర్య జూద క్రీడలకు కొమ్ముకాయడంతోపాటు సివిల్ తగాదాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేస్తున్నారంటూ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ సిఎం మంగళవారం జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీకి ఫోన్‌చేసి డిఎస్‌పి వ్యవహార శైలిపై ఆరాతీయడం, విచారణ చేసి నివేదిక అందించాలని ఆదేశించడం సైతం జరిగింది. హోంమంత్రి, డిజిపి దృష్టికి సైతం డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులు తీసుకెళ్లారు. భీమవరం డిఎస్‌పి వ్యవహారంపై చంద్రబాబు సిఎం సైతం సీరియస్‌గా ఉన్నట్లు ప్రచారం సాగింది. దీంతో విచారణ చేసిన తర్వాత డిఎస్‌పిపై సస్పెన్షన్ వేటు ఖాయమన్న చర్చ సైతం నడిచింది. అనూహ్యంగా బుధవారం ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు విశాఖపట్నంలో మాట్లాడుతూ భీమవరం డిఎస్‌పి ట్రాక్ రికార్డు అద్భుతం అన్నట్లు కితాబిచ్చారు. పవన్‌కళ్యాణ్‌కు ఎవరో తప్పుగా ఫిర్యాదు చేసినట్లు మాట్లాడారు. ఇది రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భీమవరం, ఉండి నియోజకవర్గంలోనూ అత్యధికంగా పేకాట, కోడిపందాలు సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. డిఎస్‌పి జైసూర్య జూద క్రీడలకు అండగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటి నేపథ్యంలో పవన్‌కళ్యాణ్ వద్దకు సమస్య వెళ్లిందని చెబుతున్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అండతోనే డిఎస్‌పి జైసూర్య మరింత రెచ్చిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆరునెలల కిందట డిఎస్‌పిని బదిలీచేయగా ఆయనను అక్కడే ఉండేటట్లు చేసింది రఘురామకృష్ణరాజే అన్న చర్చ సైతం నడుస్తోంది. ఈ కారణంగా డిఎస్‌పి జనసేన నేతలను ఏమాత్రమూ లెక్కచేయడం లేదన్న అభిప్రాయం ఆ పార్టీలో నెలకొంది. ఈ కారణంగానే డిప్యూటీ సిఎం పవన్‌కళ్యా ణ్ స్పందించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు డిఎస్‌పి చాలా మంచోడంటూ డిప్యూటీ స్పీకర్ అనడంతో ఏం జరుగుతుందోనన్న చర్చ సాగుతోంది. డిప్యూటీ సిఎం, డిప్యూటీ స్పీకర్ అన్నట్లుగా వ్యవహారం మారిపోయిం దంటూ రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. డిఎస్‌పిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటారా..లేక పక్కకు పెట్టేస్తారా అన్న అభిప్రాయం జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతోంది. ముందుముందు ఏంజరుగుతుందో వేచిచూడాల్సి ఉంది.

నిర్వాసితుల పునరావాసానికి 2799.60 ఎకరాల భూమి గుర్తింపు

ప్రజాశక్తి - ఏలూరు

పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల పునరావాస కార్యక్రమాలకుగాను జిల్లాలో 2799.60 ఎకరాల భూమిని గుర్తించామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌కు తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుండి బుధవారం పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల పునరావాస కార్యక్రమాల ప్రగతిపై సంబంధిత జిల్లా కలెక్టర్లతో సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములు అందించిన నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ, పరిహారంతోపాటు పనులు వేగవంతం చేయాలని అన్నారు. భూమికి భూమి, పునరావాస ప్యాకేజీ, పునరావాస కాలనీల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీలో భాగంగా అవసరమైన భూమికి భూమి, పునరావాస కాలనీల నిర్మాణానికి మొత్తం 7812.05 ఎకరాల భూమి అవసరమన్నారు. ఏలూరు జిల్లాలో ఇంతవరకు 2799.60 ఎకరాల భూమిని గుర్తించామని, వీటిలో 1734.63 ఎకరాల భూమి సేకరణ దశలో ఉందన్నారు. జిల్లాలో పునరావాస కాలనీల నిర్మాణ పనులు, కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, భూసేకరణ ప్రత్యేక కలెక్టర్, ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్, ఆర్‌డిఒలు పాల్గొన్నారు.

14 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో డాక్టర్ సిర్ర ఆల్బర్ట్ ఆధ్వర్యంలో బుధవారం 14 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాతల సహకారంతో తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు సరిపడా రక్త యూనిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉచిత రక్త మార్పిడి చికిత్సతోపాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తలసేమియా చిన్నారులకు, సహాయకులకు మధ్యాహ్నం ఉచిత భోజనం ఏర్పాటు చేసిన హేలాపురి లయన్స్ క్లబ్ సభ్యుడు నాయుడు చెన్నారావుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ జె.సత్యనారాయణరాజు, డాక్టర్ పిఎఆర్‌ఎస్.శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఎం.చంద్రశేఖర్, ఎ.నాగేశ్వరరావు, ఎం.అజయ్‌బాబు, ఎంవివిఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ఏలూరు హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులో ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు వసంతమహల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ఏలూరు హాస్పిటల్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథులుగా హాజరై హాస్పిటల్‌ను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరులో అధునాతన వైద్య సదుపాయాలను అందించాలనే లక్ష్యంతో ఈ హాస్పిటల్ నిర్మించినట్లు చెప్పారు. సాధారణ ప్రజలకు చవక ధరలతో మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆధునిక పరికరాలు, ఎమర్జెన్సీ వింగ్, ఐసియు, ల్యాబ్ సౌకర్యాలను కల్పించారని తెలిపారు. మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ నగర ప్రజలకు అత్యవసర సేవలు తక్షణమే అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, హాస్పటల్ యాజమాన్యం, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చెరువు నీరు కలుషితం కాకుండా చూడాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వాగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

జీలుగుమిల్లి శివారులో ఉన్న బుడుగుల చెరువును కలుషితం కాకుండా చూడాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు కాలుష్య నియంత్రణ అధికారులను ఆదేశించారు. బుధవారం చెరువుకు వెళ్లే వాగు ప్రాంతాన్ని కాలుష్య నియంత్రణ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట పేపర్‌బోర్డు నుంచి వ్యర్థ జలాలను వదలడం ద్వారా కాలువ గుండా చెరువులోకి వెళ్తుందని, ఆ నీటిని పశువులు తాగడంతో వ్యాధుల బారిన పడుతున్నాయని పలువురు రైతులు ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే ఫ్యాక్టరీ నుంచి వచ్చే నీటి శాంపిల్స్‌ను తీసుకుని పరీక్షలకు పంపి నివేదిక ఇవ్వాలని కాలుష్య నియంత్రణ అధికారులను ఆదేశించారు. ఎంఎల్ఎతో పాటు ఐటిడిఎ అధికారులు, ఎస్.రమేష్ ఉన్నారు.

విద్యాబోధన ఆసక్తికరంగా ఉండాలి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులకు బోధన పట్ల ఆసక్తికరంగా ఉండేలా చేయాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సూరేపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఐటీఎల్ నిర్వహించిన ఎఫ్ఎ-2 ప్రశ్న పత్రాలు పరిశీలించారు. విద్యార్థులు రాసిన పరీక్షలు కరెక్షన్ చేసి మార్కులను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు.

రీ సర్వే పారదర్శకంగా చేయాలి

ప్రజాశక్తి - దెందులూరు

భూముల రీ-సర్వే పారదర్శకంగా జరగాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదవేగి మండలంలో జరుగుతున్న భూముల రిసర్వేను ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్‌తో కలిసి ఆయన బుధవారం దుగ్గిరాలలోని పంచాయతీ కార్యాలయం వద్ద సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భూముల రీ సర్వే అంశంపై పలువురు గ్రామస్తులు తమ సందేహాలను వ్యక్తపరచగా అధికారులు వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక చేపట్టిన భూముల రీ సర్వే ఎంతో పారదర్శకంగా భూముల యజమానులు చేస్తూ వివాదరహితంగా ప్రజలు జీవించేలా కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆదేవిధంగా అధికారులు కూడా ఎక్కడ ఎలాంటి విమర్శలకు తావులేకుండా భూముల రీ సర్వే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి తహశీల్దార్ భ్రమరాంబ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని మంగరాణి

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు బిఆర్ అండ్ డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో సిపిఆర్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థిని మంగరాణి సిపిఆర్ చేసే విధానాన్ని వివరించారు. సిపిఆర్ అంటే కార్డియో పల్మనరీ రిసిసిటేషన్ అని విద్యార్థులకు వివరించారు. మనిషి గుండె కొట్టుకోవడం స్తంభించిపోయినప్పుడు, ఊపిరితిత్తులకు శ్వాస తీసుకోని స్థితిలో ఉన్నప్పుడు వెంటనే ఈ సిపిఆర్ అత్యవసర ప్రక్రియ ఉపయోగపడుతుందని వివరించారు. ఈ చర్య ద్వారా గుండెపోటు బారిన పడిన వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు గుండెపోటు వచ్చిన వ్యక్తికి సిపిఆర్ ఎలా చేయాలో, ఎలాంటి పద్ధతిలో చేయాలో బొమ్మ చక్కటి ప్రయోగ రూపంలో అవగాహన కల్పించారు. గుండెపై నొక్కడం (ఒత్తిడి చేయటం) శ్వాస అందించటం వంటి చర్యలతో వ్యక్తులు ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడబడవచ్చని తెలిపారు. చిన్నపిల్లలకు ఏ విధంగా సిపిఆర్ చేయాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కారు ఢీకొని డెంటల్ టెక్నీషియన్ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతి చెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని వొండిపాల ప్రాంతానికి చెందిన కె.సునీల్‌కుమార్ (42) స్థానికంగా డెంటల్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అతను వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై నగరం నుంచి దూబచర్ల వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన మారుతి ఆల్టో కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యుదాఘాతానికి మూడు గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన చింతలపూడి మండలంలో చోటుచేసుకుంది. బాధిత రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గోలి సత్యనారాయణ రెడ్డి అనే రైతుకు నాలుగు గేదెలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం వెలగలపల్లి మెట్టకుంట్ల ఫ్యాక్టరీ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.మూడు లక్షలు ఉంటుందని రైతు వాపోయారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గాలి కాలుష్యం.. అనారోగ్యం..!

- పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికుల ఆవేదన

ఫ్యాక్టరీ నుంచి వస్తున్న పొగ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ప్రాంత ప్రజలను కాలుష్య సమస్య తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. స్థానికంగా ఉన్న నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి ప్రతిరోజూ సాయంత్రం వేళలో పెద్ద ఎత్తున పొగ గాలిలోకి వెలువడుతోంది. దీంతో పరిసర గ్రామాల్లో గాలి నాణ్యత తీవ్రంగా పడిపోగా ప్రజలు ఊపిరి తీసుకోవడానికే ఇబ్బంది పడుతున్నారు. తాము ఇక్కడ దశాబ్దాలుగా నివాసం ఉంటున్నామని, ఇంత స్థాయిలో కాలుష్యం ఎప్పుడూ చూడలేదని, పిల్లలు దగ్గు, శ్వాస సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, అయినా అధికారులు పట్టించుకోవడంలేదని జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో దట్టమైన పొగ కమ్మేసి రోడ్లపై నడిచే వారికీ కనీసం ముందున్న దారి కనిపించని పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. కాలుష్యంతో పంటలు కూడా దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు మౌనం పాటిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టక తప్పదని స్థానికులు అధికారులను హెచ్చరిస్తున్నారు.

రెండు గ్రామాల మధ్య వివాదం

కోర్టు తీర్పుతో పంచాయతీ భవన నిర్మాణం సందిగ్ధం
పరిష్కారం కాకపోతే నిలిచిపోవచ్చు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఒక పంచాయితీ భవన నిర్మాణం రెండు గ్రామాల మధ్య వివాదం రాజేసింది. అన్న దమ్ములుగా ఉన్న ప్రజలు పార్టీలకతీతంగా ఎవరి గ్రామం కోసం వారు పట్టుబడుతుండడం కొయ్యలగూడెం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద కొయ్యలగూడెం మండలంలో కుంతలగూడెం పంచాయతీ భవనం నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరయ్యాయి. ఈ భవనం నిర్మాణం విషయమై పంచాయతీ పరిధిలోని కనకాద్రిపురం, కుంతలగూడెం గ్రామాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. గత ఐదేళ్లుగా తమ గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఉందని, దీంతో అక్కడే భవనం నిర్మించాలని కనకాద్రిపురం గ్రామస్తులు, తమ గ్రామం పేరున పంచాయతీ ఉన్న కారణంగా తమ గ్రామంలోనే భవనం నిర్మించాలని కుంతలగూడెం గ్రామస్తులు పట్టుబడుతున్నారు. అందుకోసం రెండు గ్రామాల ప్రజలు కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రెండు గ్రామాల ప్రజలు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు వద్ద పలు దఫాలుగా గోడు వెళ్లబుచ్చుకున్నట్లు తెలిసింది. ఈ లోపు పంచాయతీ గ్రామసభ పేరున సమావేశం ఏర్పాటు చేసి పంచాయతీ భవనం నిర్మాణం కుంతలగూడెంలో నిర్మించాలని చేసిన తీర్మానాన్ని వ్యతిరేకించి కనకాద్రిపురం గ్రామస్తులు స్థానిక గ్రామ కార్యదర్శికి, ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపిడిఒ సమక్షంలో ఇరు గ్రామాల మధ్య చర్చలు జరిగినా ఏకాభిప్రాయం రాలేదు. ఈ అంశం త్వరలో పరిష్కారానికి రాకపోతే భవనం నిర్మాణం నిలిచిపోవచ్చని ఎంపిడిఒ చెప్పారు.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంఎల్‌సి, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కెఎస్.లక్ష్మణరావు రూపొందించిన ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను అన్నవరం జెడ్‌పి హై స్కూల్‌లో డిసెంబర్ ఏడో తేదీన జరిగే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు యుటిఎఫ్ మండల శాఖ తరపున అందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు లక్ష్మణరావుకు, యుటిఎఫ్ నూజివీడు మండల శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, దుర్గామల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు కోరుతూ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్స్‌లో పనిచేసే శానిటేషన్ సిబ్బందికి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, జిల్లా కార్యదర్శి వి.దత్తాత్రేయ కోరారు. ఈ మేరకు విజయవాడలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్‌బాబును కలిసి వినతిపత్రం అందించారు. కాంట్రాక్టర్లు ఫస్ట్ ఆబ్జెక్ట్ ప్రయివేట్ లిమిటెడ్, ఫస్ట్ ఆబ్జెక్ట్ ఏజెన్సీ ప్రయివేట్ లిమిటెడ్ అని వేర్వేరుగా అగ్రిమెంట్లు చేసుకోవడంతో వర్కర్స్‌కు ఎవరు జీతాలు వేస్తారో తెలియని దిక్కుతోచని పరిస్థితుల్లో పారిశుధ్య కార్మికులు ఉన్నారని, దీంతో కార్మికులు చాలా నష్టపోతున్నారని డైరెక్టర్‌కు వివరించామని తెలిపారు. స్పందించిన డైరెక్టర్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించేలా తగిన ఆదేశాలు కాంట్రాక్టర్లకు ఇస్తామని, వర్కర్స్‌కు జీతాలు ఇవ్వని పక్షంలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హామీ ఇచ్చామని తెలిపారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు : చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసి ప్రజల అభిమానాన్ని మరింత అందుకోగలిగామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలన ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు గ్రామాల్లో ప్రజలకు పార్టీని మరింత చేరువ చేసేలా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో ప్రజలకు మరింత చేరువ చేస్తూ, అలాగే వారి స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించటంలో క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ 2023లో సమ్మె సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగుల కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే నవంబర్ మూడో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెను చేపడతామని తెలిపారు. మున్సిపల్ ఉద్యోగుల కార్మికుల ఆందోళనకు సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మద్దతు తెలిపారు. సిపిఐ నాయకులు అడ్డకర్ల లక్ష్మిఇందిర, కురెళ్ల వరప్రసాద్, మున్సిపల్ యూనియన్ నాయకులు సుబ్బారావు, బి.నారాయణరావు, ఎస్‌కె.ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను పరిపూర్ణంగా సేకరించాలి

పంచాయతీ కార్యదర్శులకు డిఎల్‌పిఒ సుందరి ఆదేశం

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామ పంచాయతీలు పటిష్టమైన ఆదాయం పొందేందుకు డోర్ టు డోర్ చెత్త సేకరణ పరిపూర్ణంగా చేయాలని డిఎల్‌పిఒ సుందరి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పలు శాఖల అధికారులతో ఎంపిడిఒ పి.ఏసుబాబు, ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు దీర్ఘకాలిక ఆదాయం సమకూర్చుకోవాలంటే చెత్త సంపద కేంద్రాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. పలు విషయాలను కూడా వారితో చర్చించారు. అనంతరం మండల కేంద్రమైన ముసునూరు చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


మాట్లాడుతున్న ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు

మహిళలు ఆర్థికంగా ఎదగాలని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు సూచించారు. ద్వారకాతిరుమల మండల సమైక్య సర్వసభ్య సమావేశం గ్రామంలోని బంగారు తల్లి కళ్యాణ మండపంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.అరవిందమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్ఎ వెంకటరాజు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు చేయూతనిచ్చి వారు ఆర్థికంగా ఎదగడానికి సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. 16,654 సభ్యులకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.97,62,95000 చెక్కును, తొమ్మిది వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు రూ.20 లక్షల చెక్కులను ఎంఎల్ఎ పంపిణీ చేశారు. మండలంలోని అనారోగ్యానికి గురైనవారికి సిఎం సహాయనిధి ద్వారా 22 చెక్కుల ద్వారా రూ.11,61,722 పంపిణీ చేశారు. మహిళలకు ఏ ఆపద వచ్చినా ఒక్క ఫోన్ చేస్తే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విఒఎలు వారి సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చి రూ.ఎనిమిది వేలు చాలీచాలని జీతాలతో బతుకుతున్నామని జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, లంకా సత్యనారాయణ, గ్రామ సర్పంచి కుంటం స్వర్ణలత, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మొగతడకల లక్ష్మీరమణి, సీనియర్ నాయకులు దేవరపల్లి వీరస్వామి చౌదరి, ఏపూరి దాలయ్య, జెడ్‌పిటిసి సభ్యులు శ్యామ్యులు, తుంపాటి సత్యనారాయణ, సొసైటీ ఛైర్మన్లు అద్దంకి రామచంద్రశేఖర్, రేగంటి రాంబాబు, జనసేన మండలాధ్యక్షులు దాకారపు నరసింహమూర్తి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్‌కుమార్, ఐటిడిపి మండలాధ్యక్షులు ఏపూరి కిషోర్, పార్టీ ద్వారకాతిరుమల గ్రామ అధ్యక్షులు పాకనాటి శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌తో నకిలీ మద్యానికి చెక్

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

నకిలీ మద్యానికి చెక్ పెట్టేందుకు సిఎం చంద్రబాబు ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ తీసుకొచ్చినట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ చెప్పారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌పై బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ఏరులై పారించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థలను ప్రక్షాళన చేయడం ప్రారంభించిందన్నారు. గత పాలనలో నాణ్యమైన మద్యం లేకపోవడం, ధరలు విపరీతంగా ఉండడంతో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి అయ్యేదని చెప్పారు. గత పాలకులు వాళ్ల సొంత బ్రాండ్లనే లీగల్ చేశారని, ట్రాన్స్‌పోర్ట్ కూడా సొంత వాళ్లకు ఇచ్చారని, ఇల్లీగల్ నేర సామ్రాజ్యం ఏర్పాటు చేశారన్నారు. దానిని సిఎం చంద్రబాబు పూర్తిగా నియంత్రించారన్నారు. రాష్ట్రంలో బెస్ట్ మద్యం పాలసీ తీసుకొచ్చారన్నారు. మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్ స్కానింగ్ ఉంటుందని, దానిపై స్కానింగ్ చేస్తే పూర్తి వివరాలు వస్తాయని తెలిపారు. గత ప్రభుత్వ హయంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ మందు తాగి 27 మంది చనిపోయారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం తప్పుడు ప్రచారాలను ఎవరూ పట్టించుకోరన్నారు. ఈ కార్యక్రమంలో మాటూరి వెంకటరామయ్య, మాటూరి వెంకటరామయ్య, గుత్త వెంకటేశ్వరరావు, ఇసుక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రేకుల షెడ్డు దగ్ధం

రూ.4 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.నాలుగు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. దీంతో కుటుంబ సభ్యులు కట్టు వస్త్రాలతో బయటపడ్డారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లిలోని మసీదు ఏరియాలో రెండో బజార్‌కు చెందిన మడ్డి నరసమ్మ (60) భోజన హోటల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. భర్త వెంకటరమణ ఎనిమిదేళ్ల క్రితం మరణించారు. ఇంట్లో కుమారునితో కలిసి నివసిస్తుంది. ఉదయం ఏడు గంటల సమయంలో నరసమ్మ ఇంటి నుంచి హోటల్‌లో పనిచేసేందుకు వెళ్లింది. సుమారు ఎనిమిది గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. బీరువా, బీరువాలో దాచుకున్న రూ.నాలుగు లక్షల నగదుతో పాటు ఇంట్లోని ఫ్రిడ్జ్, టివి, ఇతర గృహోపకరణాలన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న కైకలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఇతర ఇళ్లకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో అగ్ని బాధితులు కట్టు వస్త్రాలతో బయట పడ్డారు.

ఆర్థిక సాయం అందించిన వైష్ణవి

ముదినేపల్లి గ్రామానికి చెందిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ప్రమాద విషయం తెలుసుకుని అగ్ని బాధితురాలికి సాయం అందించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా మడ్డి నరసమ్మకు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో డిటి పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం

కాళ్ళకూరు గ్రామం, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా, ఫోన్: 08816-245341, సెల్: 8985244445

షార్ట్ సీల్డు కొటేషన్ ప్రకటన

ఆర్.సి.సంఖ్య : నిల్ /2025 తేది : 22-10-2025

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, కాళ్ళకూరు వార్కి ఈ క్రింది తెల్పిన ఐటమ్స్‌నకు సీల్డు టెండర్ ద్వారా కోరబడుచున్నవి.

వ. నెం.	వివరములు	స్వభావం	కాలపరిమితి	కొటేషన్ దాఖలు చేయుటకు ఆఖరు తేదీ సమయం
1.	తెపోత్సవము సందర్భముగా పద్మావతి కోనేరు వద్ద విద్యుత్ మెరుపులు ప్రదర్శన (లేజర్ షో)	సీల్డు కొటేషన్	ది.02-11-2025 తేదీ రాత్రి గం.7.00 లకు విద్యుత్ మెరుపులు ప్రదర్శన	31-10-2025 ఉదయం 10.30 గంటలకు
2	తెపోత్సవము సందర్భముగా పద్మావతి కోనేరు చుట్టు విద్యుత్ అలంకరణ మరియు 20 కే.వి జనరేటర్ ఏర్పాటు	సీల్డు కొటేషన్	ది.07-11-2025 తేదీ విద్యుత్ అలంకరణ	31-10-2025 ఉదయం 10.30 గంటలకు
3	తెపోత్సవము సందర్భముగా కోనేరు నందు ప్లాస్టిక్ డ్రమ్స్‌తో హంస అలంకరణతో తెప్ప ఏర్పాటు చేయుట	సీల్డు కొటేషన్	ది.02-11-2025 తేదీ హంస అలంకరణతో తెప్ప	31-10-2025 ఉదయం 10.30 గంటలకు

ఇతర వివరములకు దేవాలయ కార్యాలయం పని వేళల యందు సంప్రదించగలరు.

కాళ్ళకూరు, ది.22.10.2025 కార్యనిర్వహణాధికారి

అమరవీరుల త్యాగం విలువలను గుర్తించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని నూజివీడు పట్టణంలోని పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ అధికారులు పోలీస్ వ్యవస్థ ప్రాముఖ్యత అమరవీరుల త్యాగాలను వివరించారు. అమరవీరుల త్యాగం విలువలను విద్యార్థులు గుర్తించాలని తెలిపారు. పోలీసులు కేవలం నేరాలను నియంత్రించడమే కాకుండా ప్రజల భద్రత కోసం 24 గంటలు శ్రమిస్తున్నారన్నారు. ప్రతి కష్టంలోనూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. భవిష్యత్తు పౌరులుగా విద్యార్థులు చట్టాన్ని గౌరవించాలని పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో సామాజిక బాధ్యతను అనుసరించాలని కోరారు. పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడంతో పాటు వారికి గౌరవం ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి నిబద్ధత పట్ల అవగాహన పెరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ నాగేశ్వరరావు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తానని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఎ తాటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులకు అలుపెరుగని పోరాటం చేసి అమరుడైన వ్యక్తి కొమరం భీమ్ అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఎ తాటి వెంకటేశ్వర్లు, ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచి చిర్రి జగదాంబ, జనసేన అధికార ప్రతినిధి జి.రవికుమార్, మండలాధ్యక్షులు పి.రాము, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, నాలి శ్రీను, జగదాంబ ఆలయ కమిటీ ఛైర్మన్ చిర్రి వెంకటేశ్వరావు, మాజీ సర్పంచి కోర్స వెంకటేశ్వరావు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా : ఎస్ఐ

ప్రజాశక్తి - టి.నరసాపురం

అసాంఘిక కార్యకలాపాల నివారణకు డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘాను నిర్వహించినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు ఆదేశాలతో స్థానిక ఎస్ఐ ఎం.జయబాబు తన సిబ్బందితో బుధవారం డ్రోన్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈడ్‌బీడర్రు, మారుమూల ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాల నివారణ కోసం బహిరంగ మద్యపానంపై ప్రత్యేక నిఘా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పోలీస్ శాఖ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిని గుర్తించడం ప్రధాన కేంద్రాలుగా భావించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయేమోనని గమనించినట్లు తెలిపారు. ట్రాఫిక్ ప్రవాహాన్ని నియంత్రించడానికి అవసరమైన చర్యలపై సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి డ్రోన్ విజువల్స్ ఉపయోగపడతాయని తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పుట్లగట్లగూడెంలో రూ.11.92 లక్షలతో జల జీవన్ మిషన్ నూతన తాగునీటి బోరుబావి మోటార్ ఏర్పాటుకు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. తొలుత మండలంలోని గురవాయిగూడెంలో ఉన్న శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాస మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బహిరంగ వేలం ప్రకటన

మహారాష్ట్రీ ప.గో.జిల్లా, ఏలూరు మొదటి అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P.No. 192/2025 (Old E.P.No. 113/2024 in O.S.No. 45/2019

Between:

చిలుకల ధనలక్ష్మీ దేవి ...డిక్రీహోల్డర్

మరియు

యర్లపాటి ఇస్సాక్ నిర్మలబాబు ...జడ్జిమెంట్ డెటార్

పై నెంబరు దాఖలా వారంటు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ ఐ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారు ది. 13-11-2025 సం॥ తేదీ ఉదయం గం. 10-30 ని.లకు బహిరంగంగా వేలం వేయుదురు. కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును. వారి/డిక్రీ హోల్డర్ తరపు దాఖలు చేసిన ఐ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తి వివరము.

పశ్చిమగోదావరి జిల్లా (ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా) అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా, నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామ పంచాయితీలో ఆర్.ఎస్.నెం. 639/3B లో దక్షిణం వైపు ఉన్న యు. 3-17 సెంట్లులో యె. 1.58 సెంట్లు RCC బిల్డింగ్‌తో కలిపి జడ్జిమెంట్ డెటారు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో ఉండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు చేస్తూ కాబడి వేలం కావలెనుయున్న ఆస్తికి హద్దులు:

తూర్పు - Land of Mullapudi Hari Chandra Rao
దక్షిణం - Land of Cherukuri Avatharam and others
పడమర - Devulapalli Road
ఉత్తరం - Land of Ghanta Ankalu and others

అమీనా కిమ్మత్తు : Rs. 35,00,000/-
డిక్రీహోల్డర్ కిమ్మత్తు : Rs. 50,00,000/-

ఇబ్రహీం షరీఫ్
అడ్వకేట్, ఏలూరు
ఏలూరు
ది. 22-10-2025 సెల్: 92900 49530